


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



## - 121 –

## రాబందులు

**తుపాకి ధామ్మని పేలింది.** తూటా దూసుకుపోయింది. ఒక రాబందు గాలిలో గిరికీలు కొట్టుకుంటూ నేలపైకి రాలింది.

రక్తమోడుతూ గిలగిలా కొట్టుకునే ఆ రాబందును చూసి బిగ్గరగా నవ్వారు ఆ కుర్రాళ్ళు. వేట వారికి ఎంతో ప్రియమైనది. వారాంతంలో కార్లేసుకుని ఎడారి వెంట పరుగులు తీస్తూ పక్షులను వేటాడతారు వాళ్ళు.

డబ్బుతో పాటూ గర్వం, అహంకారం పెరుగుతూ వచ్చాయి. మనుషులనో జంతువులనో హింసించి ఆనందాన్ని పొందే పైశాచికత్వం కూడా. కొత్తగా పనిలో చేరిన రమణను, పాతవాడైన డ్రైవర్ కుమార్ ను సేవలు చెయ్యడానికి వారి వెంట తీసుకొచ్చారు.

కువైట్ కుర్రాళ్ళ కఠినమైన మనసును చూసి రమణ హడలిపోతున్నాడు. రోజంతా వారి మాటలు, తిట్లు, అరుపులు విని రాత్రికి జ్వరం తెచ్చుకుంటున్నాడు. కువైట్ కు ఎందుకొచ్చానా అని బాధపడుతున్నాడు.

అక్కామా పడింది కాబట్టి రెండేళ్ళు ఖచ్చితంగా ఇక్కడే పని చెయ్యాలట. అంతవరకూ బ్రతకడం ఎలా? కుమార్ వున్నాడు కాబట్టి కాస్త ధైర్యంగా వుంది.

అతడు పది నెలలుగా ఇక్కడ పని చేస్తున్నాడు.

"హేయ్ హైవాన్ పెప్సీ తీసుకురారా" సులేమాన్ అరిచేసరికి ఈ లోకంలోకి వచ్చాడు రమణ.

బిత్తరపోతూ లేచి పెప్సీలు తీసుకొచ్చి ఇచ్చాడు.

ఇంతలో అక్కడున్న వారందరికీ డ్రైవర్ కుమార్ అన్నం, కూరలు పట్టుకుని వచ్చాడు. అతడ్ని చూసి కువైటీ కుర్రాళ్ళు కేరింతలు కొట్టారు.

"సరిగ్గా టైముకు వచ్చావు. ఆకలవుతోంది అన్నం పెట్టు అన్నారు.

అందరికీ వడ్డించాడు కుమార్.

ఒంటె మాంసంతో చేసిన మసిబూసిని తృప్తిగా ఆరగించారు వాళ్ళు.

రమణను పట్టించుకోలేదు.

అందరూ తిన్నాక మిగిలినవి ప్లేటులో పెట్టి రమణకు ఇచ్చి తానూ తినబోయాడు కుమార్.

రమణ ప్లేటును కాలితో తన్నాడు ఆలీ అనే వాడు. అన్నమంతా ఇసుకలో చెల్లాచెదురుగా పడిపోయింది.

రమణకు ఏడుపు వచ్చింది. ఏడ్చేవాళ్ళను చూసి మరింత రెచ్చిపోతారు వాళ్ళు.

ఏయ్ వీడికి అన్నం నీళ్ళు ఇవ్వకు  కన్నుకొడుతూ చెప్పాడు అహ్మద్.

లోపల అయ్యో అనుకుంటూ 'సరే' అన్నట్లు తలూపాడు కుమార్.

ఏం తప్పు చేసాడో, తనపై ఎందుకో ఈ అకారణ ద్వేషం అర్థం కాలేదు రమణకు.

ఎడారి ఎండకు గొంతు ఎండి పోతోంది. నీళ్ళు తాగకపోతే ప్రాణం పోయేలా వుంది. బాగా తిని కొవ్వెక్కిన కుర్రాళ్ళు వాళ్ళు. డబ్బు తెచ్చిన మదంతో మిడిసిపడుతున్నారు. వాళ్ళతో పెట్టుకుంటే కష్టం.

అలాగే కారు చాటున ఇసుకలో కూర్చుండిపోయాడు రమణ. కువైట్ కుర్రాళ్ళు గన్స్ తీసుకుని కనిపించిన పక్షులను కాల్చేస్తున్నారు.

ఆ పక్షుల అరుపులు, రోదనలు, రక్తంతో ఆ ప్రదేశం నిండిపోయింది. ప్రాణభయంతో అరిచే అరుపులు వారికి సంతోషాన్ని సంతృప్తిని కలిగిస్తున్నాయి. శాడిజానికి పరాకాష్ట ఆ కువైట్ కుర్రాళ్ళు. వారిని చూసి భయమేసింది రమణకు.

అనవసరంగా కువైట్ వచ్చాను. వీళ్ళ చేతుల్లో చిక్కాను అని వణికిపోతున్నాడు అతడు.

"భయపడకు.  భయపడేవాళ్ళను ఇంకా హింసిస్తారు వీళ్ళు. ఎలాగో రెండేళ్ళ కాంట్రాక్ట్ పూర్తి చేసుకుని ఇండియాకు వెళ్ళిపోదాం. అంతవరకూ వీళ్ళను భరించక తప్పదు. ఇదిగో నీళ్ళ బాటిల్. తాగు" అని చాటుగా తెచ్చి అందించాడు కుమార్.

రమణది రాజంపేట. కుమార్ ది కడప. ఒకే జిల్లా వాళ్ళు కావడంతో స్నేహితులైపోయారు.

బాటిల్ తెరిచి ఒక గుక్క నీళ్ళు తాగాడో లేదో అహ్మద్ అనేవాడు చూసాడు.

"హబీబి.. హబీబి.. సును హాదె..? మాయ్ తాగొద్దని చెప్పాము కదా అంటూ మూతి మీద తన్నాడు."

చుక్కలు కనబడ్డాయి రమణకు. మూలుగుతూ నేలకు వాలిపోయాడు. ముక్కులోంచి రక్తం కారింది. కుమార్ నిశ్చేష్టుడై నిలబడి పోయాడు.

తరువాత కుమార్ దగ్గరికి వచ్చాడు వాడు."నువ్వే కదా నీళ్ళిచ్చావ్?" రెట్టిస్తూ అడిగాడు.

నోట మాట రాలేదు కుమార్ కు. ఎంత పొరపాటు చేసాడో అర్థమయి భయంతో వణికి పోయాడు.

కుమార్ కాలర్ పట్టుకుని లాక్కుంటూ సులేమాన్ దగ్గరికి తీసుకెళ్ళి "ఈ కెల్బ (కుక్క) వాడికి నీళ్ళిచ్చాడు. మనమంటే అసలు భయం లేదు చూడు" అని వాడి ముందుకు తోసాడు.

వాడు "అరె ఖింజీర్ (పంది) ఏమిరా అంత పొగరు? ఈ రోజు నీకు మూడిందిరా" అంటూ రమణను పిలిచి కుమార్ కాళ్ళూ చేతులూ కట్టెయ్యమన్నాడు.

వాడి చేతిలోని గన్ లాక్కుని వాళ్ళందరినీ కాల్చెయ్యాలనిపించింది రమణకు. తమాయించుకున్నాడు. వాళ్ళు చెప్పినట్లు చేసాడు.

"గట్టిగా కట్టావు కదా.. ఇప్పుడు ఈ తాడును నా కారు వెనక కట్టు" ఆజ్ఞాపించాడు వాడు.

వాళ్ళ క్రూరత్వానికి ఆశ్చర్యపోయాడు రమణ.

దీనంగా చూసే కుమార్ చూపులు కలవరపెడుతున్నాయి.

కదల్లేదు రమణ.

చెర్నాకోల తీసుకుని ఛెళ్ళున వీపుపై బాదాడు అహ్మద్. ఉలిక్కిపడి వీపును తడుముకున్నాడు రమణ. వళ్ళంతా చీరుకుపోయింది.

మళ్ళీ కొట్టడానికి ముందుకు వచ్చాడు అహ్మద్. కదిలి కుమార్ ను కారుకు కట్టేసాడు రమణ.

"కారు వెనకాల పరిగెత్తుకుంటూ గెస్ట్ హౌజ్ వరకూ రండి" చెపుతూ కారును స్టార్ట్ చేసాడు అహ్మద్.

ఆ రోజు నరకం చూసారు ఇద్దరూ. ఈ దినారాలు వద్దు ఏమీ వద్దు. పారిపోయి ప్రాణాలు దక్కించుకుందాం అని నిర్ణయించుకున్నారు.

కానీ తానొకటి తలిస్తే దైవం మరొకటి తలుస్తుంది.

ఆ రాత్రి కువైట్ కుర్రాళ్ళు కొట్టిన దెబ్బలతో కుమార్ కు బాగా జ్వరం వచ్చింది. వాళ్ళు తప్పించుకుని పారిపోవడానికి కుదరలేదు.

మరుసటిరోజు కూడా కుమార్ కు ఆహారం నీళ్ళు, మందులు అందకపోవడంతో జ్వరం ముదిరింది.

పనిలో పడి అతడు స్పృహలో వున్నాడో లేదో చూసేందుకు కూడా వీల్లేకపోయింది రమణకు.

ఆ రోజు సాయంత్రానికి అన్నీ సర్దుకుని గెస్ట్ హౌజ్ నుండి కువైట్ సిటీకి బయల్దేరారు వాళ్ళు.

షెడ్డులో వున్న కుమార్ ఎలా వున్నాడో చూడాలని రమణ మనసు లాగుతోంది.

జ్వరంతో వున్న కుమార్ ను ఇక్కడే వదిలేసి పోరు కదా.. ఈ కువైటీ కుర్రాళ్ళతో మాట్లాడాలంటేనే భయమేస్తోంది.

ఇంతలో అహ్మద్ అనేవాడు "హేయ్ వాడ్ని తీసుకురా పో" అన్నాడు.

ఆ మాట వినడం ఆలశ్యం షెడ్డు లోపలికి పరుగు తీసాడు రమణ.

"కుమార్ ఓ కుమార్" అని పిలుస్తూ లోనికి వెళ్ళాడు.

నిస్తేజంగా పడి వున్నాడు కుమార్. మాటా పలుకూ లేదు. అతడి వాలకం చూసి మనసేదో కీడు శంకించింది.

దగ్గరికి వెళ్ళి కుదిపాడు. జ్వరంతో వేడిగా వుండాల్సిన వళ్ళు చల్లగా తగిలింది. శరీరంలో చలనం లేదు. భయంతో బయటికి పరిగెత్తుకుని వచ్చాడు రమణ.

తడబడే మాటలతో ఏడుస్తూ విషయం చెప్పాడు.

కుర్రాళ్ళలో కంగారేమీ కనబడలేదు.

నింపాదిగా కారు దిగిన సులేమాన్ షెడ్డులో వున్న కుమార్ దగ్గరికి వెళ్ళి పరిశీలించి బయటికి వచ్చి "ఫ్రెండ్స్ వాడు పోయాడు" అని చెప్పాడు.

ఏం చేద్దాం అని ఒకరికొకరు మాట్లాడుకుని అక్కడే ఎడారిలో గొయ్యి తీసి కుమార్ ను పూడ్చేసారు.

ఘోరమైన ఆ దృశ్యాన్ని రమణ చూడలేకపోయాడు. ఇదంతా అలవాటే అన్నట్లు మామూలుగా మాట్లాడుకుంటూనే ఆ పని చేసారు వాళ్ళు. వారి ధైర్యానికి, రాక్షసత్వానికి విస్తుపోయాడు రమణ.

అతడు ఇదంతా నిజమని నమ్మలేకపోతున్నాడు. ఇలాంటి దుర్మార్గులు వుంటారా అని ఆశ్చర్యపోతున్నాడు.

ఇంత దూరం దేశాన్ని, తన వారిని విడిచి కాసుల కోసం వచ్చి ఈ ఎడారిలో దారుణంగా హింసింపబడి చనిపోయాడు.

తనవారికి కనీసం చివరి చూపు కూడా దక్కలేదు. ఎంత దారుణం. వాస్తవంగా కుమార్ స్థానంలో తనుండాలి.

కానీ అదృష్టమో దురదృష్టమో తన బదులు కుమార్ బలయిపోయాడు. ఒక విధంగా అతడు తన ప్రాణదాత.

ఆలోచనలతో పిచ్చెక్కిపోతోంది. నిన్నటి వరకూ బాగున్న కుమార్ ఇప్పుడు లేడు అనుకుంటే దు:ఖం పొంగి వస్తోంది. భోరున ఏడవాలని వుంది. కానీ వాళ్ళ ముందు అది కుదరదు.

"రేయ్ హిందీ ఈ విషయం ఎవరికైనా చెప్పావో నీకూ ఇదే గతి పడుతుంది జాగ్రత్త" తర్జని చూపిస్తూ బెదిరించాడు అహ్మద్.

వాడి ముఖంలో క్రూరత్వానికి భయపడ్డాడు రమణ. రెండేళ్ళు వీళ్ళ దగ్గర పని చెయ్యడం సాధ్యమేనా?

తిరిగి ఇండియాకు వెళ్ళి తన వాళ్ళను చూడటం జరిగే పనేనా? అంతవరకూ తనను ప్రాణాలతో వుండనిస్తారా?

వీళ్ళకు మనిషి ప్రాణం అంటే లెక్కలేదు. హింసించి ఆనందించడం వీరి నైజం. ఏ రోజు తనకు మూడుతుందో తెలియదు. పారిపోవాలి, వీరికి దూరంగా ఈ కువైటును విడిచి పారిపోవాలి. ప్రాణాలు దక్కించుకోవాలి అని నిశ్చయించుకున్నాడు రమణ.

మరుసటి రోజు అహ్మద్ తండ్రి బాబా హుస్సేన్ వచ్చి కుమార్ గురించి అడిగాడు.

ఏం చెప్పాలో అర్థంకాక రమణ మౌనంగా నిలబడిపోయాడు.

అక్కడే వున్న అహ్మద్ అందుకుని "బాబా.. ఆ వెధవ కుమార్ పారిపోయాడు. వాడిని వెతికి పట్టుకుని ఎముకలువిరిచెయ్యాలి" అంటూ అబద్ధం చెప్పాడు.

రమణకు దు:ఖం ముంచుకొచ్చింది కానీ నిగ్రహించుకున్నాడు.

"అంత పని చేసాడా ఆ కుమార్! పోలీస్ కంప్లైంట్ ఇస్తే వాళ్ళే వెతికి పట్టుకుని మక్కెలిరగ తంతారు" అన్నాడు బాబా.

"అలాగే ఇద్దాం బాబా ఆ విషయం నేను చూసుకుంటాలే" అన్నాడు అహ్మద్ మాటలు ముగిస్తూ.

రోజులు గడుస్తున్నాయి. రూములో కుమార్ లేని లోటు తెలుస్తోంది. కుమార్ మంచం ఖాళీగా వుండి వెక్కిరిస్తోంది.

రమణకు ఏడుపొస్తోంది. రాత్రిపూట నిద్ర రావడం లేదు. పీడ కలలూ, కలవరం, దిగులుతో చిక్కి శల్యమవుతున్నాడు.

ఒకరోజు కుమార్ పేరుతో ఒక ఉత్తరం వచ్చింది.

తెరిచి చదివాడు.

కుమార్ భార్య వ్రాసింది.

పిల్లలు "నాన్న ఎప్పుడు వస్తాడు అని అడుగుతున్నారని, పెద్దోడికి స్కూల్ ఫీజు పదివేలు కట్టాలని" వ్రాసింది.

ఏం చెయ్యాలో తోచలేదు రమణకు. కుమార్ బ్యాగులు వెతికాడు. కుమార్ భార్య సుగుణ బ్యాంక్ అకౌంట్ నంబర్ దొరికింది. జీతం రాగానే కుమార్ పేరుతో పదివేలు పంపించి బాగున్నానని పండక్కి వస్తానని ఒక ఉత్తరం వ్రాసి పోస్ట్ చేసాడు.

కుమార్ చావు కళ్ళ చూసాక ఇక అక్కడ వుండి పని చెయ్యాలంటే భయమేస్తోంది రమణకు.

ఒక్కడే పనంతా కూడా చెయ్యలేకపోతున్నాడు. కువైట్ కుర్రాళ్ళు రమణను బాగా వాడుకుంటున్నారు. ఆడుకుంటున్నారు కూడా. బాధలు భరించడం కష్టమై పోతోంది.

చిక్కి శల్యమై పోతున్నాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు రమణ.

కుమార్ భార్య నుండి ఉత్తరాలు వస్తూనే వున్నాయి. కుమార్ రాసినట్లే రాసి పోస్ట్ చేస్తున్నాడు రమణ.

అందులో కుమార్ రాసినట్లే కొన్ని ముద్దులూ, ముచ్చట్లూ కూడా రాయక తప్పడం లేదు.

అపుడపుడూ ఆమెకు, పిల్లలకు అవసరమయిన డబ్బు కూడా పంపిస్తున్నాడు.

ఒక సంవత్సరం గడిచిపోయింది.

రమణకు అరబ్బీ భాష వచ్చేసింది. చుట్టుపక్కల పనివాళ్ళతో పరిచయాలు పెరిగాయి.

సంక్రాంతి దగ్గరకొచ్చింది.

పండగకు కుమార్ ఇంటికొస్తాడని భార్య సుగుణ పిల్లలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నాటకం ఎన్నిరోజులో, సుగుణకు నిజం ఎలా చెప్పాలో రమణకు అర్థం కావడం లేదు.

ఈ మధ్యలో అప్పుడప్పుడూ కువైట్ కుర్రాళ్ళతో కలిసి ఎడారి వేటకు వెళ్ళి వస్తున్నాడు. అక్కడ కుమార్ ను పాతి పెట్టిన ప్రదేశాన్ని చూసినపుడల్లా అతడికి దు:ఖం ముంచుకొస్తోంది.

ఏదో చెయ్యాలి, కుమార్ కు జరిగిన అన్యాయాన్ని జనాలకు చెప్పాలి. కువైట్ కుర్రాళ్ళకు శిక్ష పడాలి అనే తలంపుతో కోపం కూడా వస్తోంది.

దీనికి పరిష్కారం ఏమిటో తెలియక ఒకరోజు పక్కింట్లో పని చేసే ఇండియా డ్రైవర్ మధుకు విషయం చెప్పి ఏడ్చాడు.

"అరె మామా ఎంత పని జరిగింది? ఇన్నిరోజులూ కుమార్ పారిపోయాడనే అనుకుంటున్నాం మేము. నువ్వు కుమార్ వస్తువులు తీసుకుని ఇండియా ఎంబసీకి వెళ్ళి విషయం చెప్పు. వాళ్ళు కువైట్ పోలీసులకు కంప్లైంట్ ఇస్తారు" అని సలహా ఇచ్చాడు.

ఒకరోజు ఆ పనే చేసాడు రమణ.

ఇండియా ఎంబసీ సీరియెస్ గా తీసుకుని కువైట్ పోలీసులను వెంటబెట్టుకుని ఎడారిలోకి వెళ్ళి కుమార్ శవాన్ని వెలికి తీసింది.

కువైట్ కుర్రాళ్ళను అరెస్ట్ చేసారు.

రమణ ఇంత పని చేసాడని తెలిసి ఆ కుర్రాళ్ళు నిర్ఘాంతపోయారు.

ఎంబసీ టికెట్ తీసి రమణను ఇండియాకు పంపింది.

కుమార్ ను చంపినందుకు పరిహారంగా కువైట్ సేటు నుండి డబ్బు వసూలు చేసి కుమార్ భార్యకు పంపించారు.

విషయం కుమార్ భార్యకు, బంధువులకు తెలిసి రోదించారు.

ఇన్నిరోజులూ రమణే ఉత్తరాలు రాసి డబ్బు పంపాడని తెలిసి సుగుణ అతడికి కృతజ్ఞతలు చెప్పింది. కుమార్ అమ్మనాన్నలు కూడా రమణను తమ కొడుకులా భావించారు.

కొద్దిరోజులు గడిచాక కుమార్ తల్లితండ్రులు సుగుణను పెళ్ళి చేసుకుని పిల్లల బాధ్యత తీసుకోమని రమణను అర్థించారు.

ఆ కుటుంబానికి కుమార్ లేని లోటును తీర్చడానికి సంతోషంగా ఒప్పుకున్నాడు రమణ.

(మరోకథ వచ్చేనెలలో)

COMMENTS